



సమావేశానికి హాజరైన నాయకులు



బిజినేపల్లి సభకు వేలాదిగా హాజరైన ప్రజలు

- పెండింగ్ ప్రాజెక్టుల పూర్తితో పచ్చదనం చూపిస్తా
- కమీషన్ల కోసమే ప్రాజెక్టుల్లో పునాది రాయి వేసిన కేసీఆర్
- జిల్లా సమగ్రాభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా పని చేయాలి
- బిజినేపల్లి సభలో సీఎం రేవంత్‌రెడ్డి



సభలో అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఎమ్మెల్యేలు రాజేష్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లురవి

జిల్లా సమగ్రాభివృద్ధే.. నా ఆశయం

నాగర్‌కర్నూల్/బిజినేపల్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): 'ఈ ప్రాంతంలో పుట్టిన బిడ్డను. సమగ్రాభివృద్ధే నా జీవిత ఆశయం' అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. పాలమూరు జిల్లా ప్రజలు అనేక పోరాటాలు, త్యాగాలు చేస్తే ప్రాజెక్టుల ద్వారా కేసీఆర్ కమీషన్లు దండుకున్నారని చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలో ఎంపీ అభ్యర్థి మల్లు రవికి మద్దతుగా మంగళవారం నిర్వహించిన జన జాతర బహిరంగ సభకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు సంబంధించిన అనేక అంశాలను ప్రస్తావించారు. 2009 వరదల్లో అలంపూర్‌లోని అనేక ఇండ్లు కొట్టుకుపోతే.. హైదరాబాద్‌లోని తన ఇల్లు అమ్మైనా సరే వారికి న్యాయం చేకూరుస్తానన్న కేసీఆర్ పదేళ్ల నుంచి ఎక్కడికి పోయారని ఆయన ప్రశ్నించారు. ఆంధ్రా పాలకులతో కుమ్మక్కై ఉద్దేశపూర్వకంగా అనేక ప్రాజెక్టులను తొక్కి పట్టారన్నారు. ఉద్యమాలు చేసి సాధించుకున్న కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులు పూర్తి కాకుండానే జాతికి ఎలా అంకితం చేస్తారని ప్రశ్నించారు. 70 ఏళ్ల అనంతరం బూర్గుల రామకృష్ణారావు తర్వాత పాలమూరు బిడ్డకు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం దక్కిందని, అన్ని రాజకీయ పక్షాలు పార్టీలకు అతీతంగా ఏకమై జిల్లాను ఆదర్శంగా అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న కోదండరాం

అమలు చేసి తీరుతాం: రాజేష్‌రెడ్డి

అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీని అమలు చేసి తీరుతామని ఎన్నికల కోడ్ రావడంతో కొన్ని గ్యారెంటీలు అమలు చేయడంలో ఆలస్యమైందని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీగా మల్లురవిని గెలిపించి, సీఎంకు బహుమతిగా ఇవ్వాలన్నారు.

పాలమూరు రేవంత్‌రెడ్డి అడ్డా: సంపత్‌కుమార్

ఎవరు అవునన్నా.. కాదన్నా.. పాలమూరు గడ్డ మన నలమల్ల బిడ్డ సీఎం రేవంత్ రెడ్డి అడ్డ అని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. సీఎంకు మరింత బలం పెరగాలంటే పాలమూర్ జిల్లాలోని రెండు పార్లమెంటు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. బీఆర్ఎస్, బీజేపీకి ఓటు వేస్తే రాష్ట్రంలో అభివృద్ధికి చేటు కలుగుతుందన్నారు.

కాంగ్రెస్‌కు టీజేఎస్ మద్దతు: కోదండరాం

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు టీజేఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం చెప్పారు. రాష్ట్రంలో దొర గడి పాలనకు అంతం పలికిన ప్రజలు.. దేశంలో రైతు వ్యతిరేక, మతతత్వ భావజాలం ఉన్న బీజేపీని గద్దె దించేందుకు కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ దళిత జాతి ఆత్మగౌరవాన్ని కేసీఆర్ పాదల వద్ద తాకట్టుపెట్టాడని అన్నారు.

సీఎం రేవంత్‌కు ఘన స్వాగతం

ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా సొంత జిల్లాకు వచ్చిన రేవంత్‌రెడ్డికి బిజినేపల్లి బహిరంగ సభలో ఘన స్వాగతం లభించింది. సెంటిమెంట్ ప్రకారం బిజినేపల్లిలో సభ నిర్వాహణకు ప్రాధాన్యత ఇచ్చిన సీఎం జిల్లావాసులందరినీ ఆత్మీయంగా పలుకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్యలను తెలుసుకున్నారు. పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, ఆర్డీఎస్, తుమిళ్ల ప్రాజెక్టుల గురించి ప్రధానంగా ప్రస్తావించారు. ఆరునూరైనా ఉమ్మడి పాలమూరు జిల్లాలో 12 లక్షల ఎకరాలకు ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందిస్తానని చెప్పగా ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. సభలో నాయకులు సుదీర్ఘంగా ప్రసంగిస్తున్నప్పుడల్లా కేకలు, ఈలల ద్వారా రేవంత్‌రెడ్డి మాట్లాడాలని కార్యకర్తలు నినాదాలు చేశారు. ఒక దశలో రేవంత్‌రెడ్డి ప్రసంగం తప్ప ఎవరీ మాటలు వినమని నినాదాలు చేయడం గమనార్హం. సభ సక్సెస్ కావడంతో కాంగ్రెస్ నాయకులు జోష్‌లో ఉన్నారు.



నాగర్‌కర్నూల్ ఎంపీగా మల్లు రవిని అత్యధిక మెజార్టీ గెలిపించాలని కోరారు.

సోనియమ్మ రుణం తీర్చుకుందాం: చిన్నారెడ్డి

తెలంగాణ ప్రజల ఆరు దశాబ్దాల కల ప్రత్యేక తెలంగాణను ఇచ్చిన సోనియమ్మకు రెండు ఎంపీ సీట్లు గెలిచి ఇచ్చి, రుణం తీర్చుకుందామని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. పాలమూర్ బిడ్డ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండడం మన అదృష్టంగా భావించి, పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీ గెలిపించి కేంద్రంలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేసుకుందామన్నారు.

అన్ని వర్గాలకు అండ కాంగ్రెస్: మల్లురవి

స్వాతంత్ర్య పోరాట కాలం నుంచి నేటి వరకు దేశంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధికి అండగా ఉన్నది కాంగ్రెస్ జెండా ఒక్కటేనని నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లురవి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ఆకర్షణ ఉన్న నాయకుడే కాదని, ప్రజా రంజక పాలన అందించే దక్షకుడని కొనియాడారు. 2014లో ధనిక రాష్ట్రాన్ని ప్రజలు కేసీఆర్‌కు అప్పగిస్తే అప్పుల కుప్పగా మార్చాడన్నారు. నాగర్‌కర్నూల్ నియోజక వర్గం నుంచి తనని ఎంపీగా గెలిపిస్తే అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి, పాలమూరును పచ్చగా మారుస్తామని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ నాయకులు, అభిమానులు ఆయన తల్లిదండ్రుల చిత్రపటాన్ని బహుమతిగా అందజేశారు. తన తల్లిదండ్రుల చిత్రపటాన్ని అపురూపంగా చిత్రీకరించి, అందజేసిన కూచకుళ్ల సుహాసన్ రెడ్డితో పాటు పలువురికి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అధ్యక్షత వహించిన ఈ సభలో ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జోగులాంబ గద్వాల జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ సరిత, స్థానిక నాయకులు కూచకుళ్ల సుహాసన్ రెడ్డి, హబీబ్, కర్నాటి తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

ఆత్మగౌరవానికి.. ఓటేయండి

- 70 ఏళ్ల చరిత్రలో సీఎం పదవితో పాలమూరుకు అవకాశం వచ్చింది..
- జిల్లా సమగ్రాభివృద్ధి కోసం కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి
- 69 జీవో అమలుకు కిరణ్‌కుమార్ సిద్ధమైతే డీకే అరుణ అడ్డుకుంది
- ఇక్కడి బిడ్డవు అయితే ఈ ప్రాంత అభివృద్ధిని ఎందుకు చేయలేదు
- మోదీ చేతిలో సురకత్తిలా మారిన అరుణ పాలమూరునే పొడుస్తుంది
- కొడంగల్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



మద్దూరులో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి; చిత్రంలో అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలంతా పార్లమెంట్ ఎన్నికల్లో ఆత్మగౌరవానికి ఓటు వేయాలని, పాలమూరు సమగ్రాభివృద్ధి కోసం 70 ఏళ్ల చరిత్రలో సీఎం పదవితో వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని మద్దూరు మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కొడంగల్ ప్రజలు 2009లో 14 రోజుల ముందు వచ్చిన తనను 7,900 మెజారిటీతో ఆశీర్వదించి.. ఇక్కడ మొక్క నాటారాని అన్నారు. కొడంగల్‌లో అచ్చుతరెడ్డి ఉన్నప్పుడు ఒక్కసారి మంత్రి పదవి వచ్చిందని, ఆ తర్వాత ఇప్పుడు ఆ లోటు భర్తీ చేసేందుకు ఏకంగా సీఎం పదవి వచ్చిందన్నారు. తాగు, సాగునీరు, అభివృద్ధి విషయంలో కొడంగల్ ఇన్నేళ్లు వెనుకబాటులో ఉండిందని, ఇతర ప్రాంతాల నాయకుల వద్ద చేయి చాపే పరిస్థితి నుంచి.. ఇప్పుడు కొడంగల్ ఎవరికైనా ఇచ్చే స్థాయికి చేరుకుందని అన్నారు. తాను సీఎం అయిన వంద రోజుల్లోనే రూ.ఐదు వేల కోట్లతో కొడంగల్‌కు అభివృద్ధి పనులు మంజూరు చేశానని చెప్పారు. ఎదిగినా ఒదిగి ఉండాలని, కేసీఆర్‌లాగా ఫామ్ హౌజ్‌కు వెళ్లి ఎవరినీ కలవకుండా ఉండటం లేదని, ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా.. రోజుకు 18 గంటలు పని చేస్తున్నానని అన్నారు. మక్తల్, నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని రూ.నాలుగు వేల కోట్లతో చేపట్టి.. 1.30 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వబోతున్నామని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ వేయడానికి వస్తే తన గెలుపు బాధ్యతలు తీసుకుని.. కార్యకర్తలే పని చేశారని, 33 వేల మెజారిటీతో గెలిపించి.. సర్టిఫికెట్ తీసుకుని హైదరాబాద్ వచ్చారన్నారు. ఇప్పుడు ఐదుసార్లు నియోజకవర్గానికి వచ్చానని, తనను దొంగదెబ్బ తీసేందుకు బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటయ్యాయని చెప్పారు. జీవో 69ను అమలు చేయడానికి అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి సిద్ధంగా ఉన్నా.. డీకే అరుణ అమలు చేయనీయకుండా అడ్డుకుందని ఆరోపించారు. ఇక్కడి బిడ్డవే అయితే.. కొడంగల్, నారాయణపేట, మక్తల్‌తోపాటు మిగతా నియోజకవర్గాలు ఎందుకు వెనుకబాటులో ఉన్నాయని ప్రశ్నించారు. చించోలి హైవే.. వికారాబాద్- కృష్ణా రైల్వేలైన్, సాగునీరు, ఇంజనీరింగ్, జూనియర్ కాలేజీలు, డబుల్ రోడ్లు, బీటీ రోడ్లు ఎందుకు మంజూరు చేయించలేదని ప్రశ్నించారు. తాను ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రినని, డీకే అరుణ మోదీ చేతిలో చురకత్తిలా మారి.. పాలమూరునే పొడవాలనుకుటుందని ఆరోపించారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా ఉన్న ఆమె.. పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా ఎందుకు తేలేదని అడిగారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గ స్థానాలకు 12 స్థానాల్లో గెలిపించి.. పాలమూరు జిల్లా అంతా తన వెంట అండగా ఉందన్నారు. అలాంటప్పుడు డీకే అరుణపై తనకు అసూయ ఎందుకు ఉంటుందని ప్రశ్నించారు. తనకు పాలమూరులో శత్రువులు లేరని చెప్పారు. పాలమూరు అభివృద్ధే ధ్యేయంగా తాను పనిచేస్తానని మరోసారి స్పష్టం చేశారు. లేక లేక అవకాశం వచ్చిందని, పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు ద్వారా మరింత స్థైర్యం ఇవ్వాలని కోరారు. 2009లో తెలంగాణ వచ్చి.. పాలమూరు అభివృద్ధి చెందుతుందని కేసీఆర్‌ను గెలిపిస్తే, పదేళ్లలో కేఎల్ఐ, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, జూరాల, పీఆర్ఎల్ఐ ప్రాజెక్టులను పూర్తి చేయలేదని విమర్శించారు. కేవలం సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ బాగుపడ్డాయని చెప్పారు. జీవో 69ని పదేళ్లు తొక్కి పెట్టారని అన్నారు. అయిదేళ్లు నిలబడండి.. వందేండ్ల అభివృద్ధి చేసి చూపుతానని తెలిపారు. జెండాలు, అజెండాలు, పార్టీలు పక్కన పెట్టి పాలమూరు అభివృద్ధి కోసం ఓటు వేయాలని కోరారు. సమావేశంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రాంమ్మోహన్‌రెడ్డి, పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బావోజీని దర్శించుకున్న సీఎం



బావోజీని దర్శించుకుని పూజలు చేస్తున్న రేవంత్‌రెడ్డి

మద్దూర్: కొత్తపల్లి మండలం తివ్మారెడ్డి పల్లిలో కొనసాగుతున్న గిరిజనుల ఆరాధ్యదైవం గురులోక మాసంత్(బావోజీ) బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామిని సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు సీఎంకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు చేశారు. రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, తాండూరు, పరిగి ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డి బావోజీని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

తుమ్మిళ్ల కింద రిజర్వాయర్లు నిర్మించాలి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 23: రేవంత్ మగాడివైతే తమ ప్రభుత్వం హయాంలో నిర్మించి తుమ్మిళ్ల ఎత్తిపోతల కింద మల్లమ్మ కుంట, జూలకల్, వల్లూరు రిజర్వాయర్లను నిర్మించి చూపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారక రామారావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా అలంపూర్ చౌరస్తాలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాటలెక్కువ, పని తక్కువ అన్నట్లు సాగుతుందన్నారు. రేవంత్‌రెడ్డి ఏ ఊరికి పోతే ఆ ఊరి దేవుళ్లపై ఒట్టు వేసి చెబుతున్నాడని, రేపు ఇక్కడకు వచ్చి జోగుళాంబ సాక్షిగా అని నమ్మించే ప్రయత్నం చేస్తాడని, ఇది నమ్మి మరోసారి మోసపోవద్దని సూచించారు. వయసుకు కూడా విలువ ఇవ్వకుండా కేసీఆర్‌ను సూటిపోటి మాటలంటున్నాడని, నేను కూడా ఆయన బాషలోనే అడుగుతున్నానని.. రేవంత్ నువ్వు మగాడివైతే తమ ప్రభుత్వం హయాంలో నిర్మించిన తుమ్మిళ్ల ఎత్తిపోతల కింద మల్లమ్మకుంట, జూలకల్, వల్లూరు రిజర్వాయర్లను నిర్మించి చూపించాలన్నారు. తాము నిర్మించిన వంద పడకల ఆస్పత్రిని వినియోగంలోకి తేవాలని, నెట్టెంపాడు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మొన్న సూర్యాపేటలో ఓ బస్సులో జేబు దొంగ కత్తులు పెట్టుకుని తిరుగుతుంటే పోలీసులు ఎందుకు కత్తులు పెట్టుకున్నావని విచారణ చేస్తే.. అదేం సార్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే జేబులో కత్తులు పెట్టుకుని తిరుగుతున్నాడని, తాను పెట్టుకుంటే తప్పేంటని అన్నాడన్నారు. అంటే రాష్ట్రంలో దొంగలు రేవంత్‌రెడ్డి ఆదర్శంగా తీసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. నాగర్‌కర్నూల్‌లో పోటీ చేస్తున్న ముగ్గురు అభ్యర్థులను గమనించాలని, సమర్థుడైన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలన్నారు. కారుకు ఓటేసి గెలిపిస్తే అసెంబ్లీలో మన విజయుడు ఉన్నాడు, పార్లమెంట్‌లో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఉంటే రాయచూరు రహదారిని జాతీయ రహదారిగా మార్చుకోవడమేగాక నడిగడ్డ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. మన ప్రభుత్వ హయాంలో నీళ్లకు, కరెంటుకు, రైతుబంధుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అమలు చేశామని, దాంతో ఉమ్మడి జిల్లాలో నడిగడ్డకు కర్నూల్ నుంచి కూలీలు వలస వచ్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో ప్రజలు చాలా ఆగ్రహంతో ఉన్నారని, దీనిని ఓట్ల రూపంలో చూపాలన్నారు. తెలంగాణలో మనం జిల్లాకు ఒక మెడికల్ కళాశాల నిర్మిస్తే మోదీ ఒక్క మెడికల్ కళాశాల కూడా నిర్మించలేదన్నారు. అందుకే కేసీఆర్ బలపరిచిన విద్యావంతుడైన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఓటేయ్యాలని, ఆయన గురించి గతంగతః అని, ఆర్ఎస్ పవీణ్‌కుమార్ ఇప్పుడు బీఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అని చెప్పారు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే త్వరలోనే అధికారంలోకి వస్తామని అన్నారు. నా మిత్రుడు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి అష్టకష్టాలు పడుతున్నాడన్నారు. హామీలను నెరవేర్చని కాంగ్రెస్‌కు భయం పుట్టాలన్నా, చెప్పిన పనులు చేయలన్నా ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలన్నారు. ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా నిలబెట్టిన రాష్ట్ర సాధకుడు కేసీఆర్ ఆశీర్వదంతో మీ బిడ్డగా ముందుకు వచ్చానని, తనను ఆశీర్వదించాలని కార్యకర్తలను కోరారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యేలు విజయుడు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అలంపూర్ నియోజకవర్గంలోని మునిసిపల్ చైర్‌పర్సన్లు మనోరమ, కరుణశ్రీ, చైర్‌పర్సన్ దేవన్న, నాయకులు గజేందర్ రెడ్డి, పరమేశ్వరరెడ్డి, పటేల్ విష్ణువర్ధన్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, రజిత, సుష్మ, గడ్డం కృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్

ధాన్యం కొనుగోలుకు సిద్ధం

- నిబంధనల ప్రకారం తెస్తే మద్దతు ధర
- కొనుగోలు చేసిన ధాన్యం తరలించేందుకు మిల్లుల రెడీ
- జోగులాంబ గద్వాల అదనపు కలెక్టర్ ముసిని వెంకటేశ్వర్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



గద్వాల, ఏప్రిల్ 23: జోగుళాంబ గద్వాల జిల్లాలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని అదనపు కలెక్టర్ ముసిని వెంకటేశ్వర్లు మంగళవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. 'ధాన్యం కొంటలేరు' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. 70 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి.. గన్నీ బ్యాగులు, కాంటాలు, టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచామని చెప్పారు. రైతులు బయట తక్కువ ధరకు విక్రయించకుండా.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మొదటి రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 ధర పొందొచ్చని చెప్పారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించడానికి మిల్లులను సిద్ధం చేశామని వివరించారు. గద్వాల వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన ధాన్యంలో తేమ 30 నుంచి 40 శాతం వరకు ఉండటంతో వ్యాపారులు తక్కువ ధర కోట్ చేశారని, ఎక్కడా సిండికేట్ జరగలేదని చెప్పారు. నిబంధన ప్రకారం రైతులు ధాన్యం తెస్తే మద్దతు ధర లభిస్తుందన్నారు. ధాన్యం కొనుగోలులో ఏమైన సమస్యలు ఉంటే రైతులు 8688688812 నంబర్‌కు ఫోన్ చేయొచ్చని సూచించారు.

పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్లు

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఆదేశించారు. నాగర్‌కర్నూల్ నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో గల ఏడు నియోజకవర్గాల స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను వనపర్తి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, అదనపు కలెక్టర్లతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ సెంటర్‌కు సంబంధించి బందోబస్తు, స్ట్రాంగ్ రూమ్ హాల్‌ను నిశితంగా పరిశీలించారు. ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ కౌంటింగ్ నిర్వాహణకు విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి కౌంటింగ్ ఏజెంట్లకు ప్రవేశం, బారీకేడింగ్ ఏజెంట్లకు సంబంధించిన వాహనాలు నిలుపుటకు పార్కింగ్ స్థలం ఏర్పాట్లపై చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రాంగణంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఆవరణను పరిశీలించి అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, నగేష్, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 23 : జోగుళాంబ గద్వాల జిల్లా పుల్లూరు టోల్ ప్లాజా వద్ద మంగళవారం పది లీటర్ల మద్యం లభించినట్లు ఎస్సై శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. కర్నూలు జిల్లా ఈ.తాండ్రపాడు గ్రామానికి చెందిన నరసింహులు అనే వ్యక్తి రూ.11,790 విలువ గల 10.32లీటర్ల మద్యాన్ని సీసాల్లో తీసుకెళ్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.



అదానీ, అంబానీలకు కొమ్ము కాస్తున్న కేంద్ర ప్రభుత్వం

- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

బిజినేపల్లి, ఏప్రిల్ 23 : సామాన్యుడి కొనుగోలు శక్తికి మించి వస్తు ధరలను పెంచుతూ కార్పొరేట్ వ్యాపారులు అంబానీ, అదానీలకు మాత్రం రూ.30 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వం వారికి కొమ్ము కాస్తోందని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత ప్రపంచ స్థాయి మిలినీయర్లు 80 నుంచి 160 మందికి పెరిగారని, దేశంలోని సంపదలో 50 శాతం వారి చేతిలోనే ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దేశంలో పేదరికం రోజురోజుకు పెరిగిపోయిందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరిగాయని అబద్ధాలు చెబుతూ డీజిల్, పెట్రోల్ ధరలను విచ్చలవిడిగా పెంచి దోచుకుంటున్నారని అన్నారు. అదేవిధంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం కావడంతో రెండు శాతం ఉన్న నిరుద్యోగులు, ఎనిమిది శాతానికి పెరిగిపోయారని వాపోయారు. సోషల్ మీడియాలో కేంద్ర ప్రభుత్వ అవినీతిని, ప్రజా వ్యతిరేక విధానాలు ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే బడుగు, బలహీన వర్గాల బతుకుల్లో వెలుగులు వస్తాయని అన్నారు. సమావేశంలో వంగూరు జడ్పీటీసీ సభ్యుడు కేవీఎన్ రెడ్డి, ఖాదర్‌పాష, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు కర్నాటి తిరుపతయ్య, అమృత్‌రెడ్డి, వెంకటస్వామి, మాన్యానాయక్, సాయికుమార్‌రెడ్డి, నీలం రామకృష్ణ, పర్వతాలు తదితరులున్నారు.



కొనసాగుతున్న తనిఖీలు

- పట్టుబడుతున్న నగదు

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 23 : ఎన్నికల నేపథ్యంలో ఏపీ-తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద పోలీసుల తనిఖీలు కొనసాగుతున్నాయి. మంగళవారం 44వ జాతీయ రహదారిపై పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద మొత్తం రూ.3.64,430 లక్షల నగదు పట్టుకున్నట్లు ఉండవెల్లి ఎస్సై శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. కర్నూలు వైపు నుంచి హైదరాబాదు వైపు వస్తున్న ఎండీ.మోహిన్ వద్ద రూ.1.30లక్షలు, వెంకటేశ్వర్లు వద్ద రూ.1,0930 లక్షలు, ఖాజాబాష వద్ద రూ.68,500లు, కృష్ణచైతన్యరెడ్డి వద్ద రూ.65వేల నగదు పట్టుబడిందని చెప్పారు. నగదుకు సంబంధించి ఎలాంటి రశీదులు లేకపోవడంతో సీజ్ చేసి, గ్రీవెన్స్ కమిటీకి అందించినట్లు ఎస్సై తెలిపారు.

నాలుగున్నర లక్షలు పట్టివేత

కొత్తకోట : వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణంలో నాలుగున్నర లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఎస్సై మంజునాథ్‌రెడ్డి మంగళవారం ప్రధాన రహదారిపై తనిఖీలు నిర్వహిస్తుండగా కొత్తకోటకు చెందిన రాములు మినీ వాహనంలో రూ.4.5 లక్షలతో వెళ్తుండగా తనిఖీ చేశారు. నగదుకు సంబంధించి పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పట్టుబడిన మద్యం సీసాలు


ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 23 : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని శివారు ప్రాంతంలో మంగళవారం అక్రమంగా నిల్వ చేసిన మద్యం సీసాలను పట్టుకున్నట్లు ఎస్సై శ్రీహరి తెలిపారు. మండలంలోని రుక్కన్నపల్లి గ్రామానికి చెందిన చెన్నయ్య అనే వ్యక్తి మండల కేంద్రం శివారు ప్రాంత వనపర్తి ప్రధాన రహదారి పక్కనే బీరు, క్వాటర్ల మద్యం సీసాల కాటన్లను కలిగి ఉండి అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులు విచారించి మద్యం సీసాలను సీజ్ చేసినట్లు ఎస్సై వివరించారు. సుమారు రూ.20వేల విలువ గల 50 లీటర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.




















సలేశ్వర క్షేత్రానికి భక్తజనం

- లింగమయ్య నామస్మరణతో మారుమోగుతున్న నల్లమల అడవులు



లింగమయ్యకు పూజలు చేస్తున్న భక్తులు



సలేశ్వరం కొండల్లో క్యూలైన్లలో వెళుతున్న భక్తులు

మన్ననూర్, ఏప్రిల్ 23 : నిండు పౌర్ణమి రోజున సలేశ్వర గుండంలో స్నానాలు ఆచరించి లింగమయ్యను దర్శనం చేసుకుంటే సర్వపాపాలు హరించుకుపోతాయనే నమ్మకంతో మంగళవారం ఉదయం నుంచి రాత్రి దాకా వేలాది మంది భక్తులు సలేశ్వర క్షేత్రానికి తరలివెళ్లారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు నల్లమలలోని సలేశ్వర క్షేత్రానికి తరలివస్తున్నారు. లోయ ప్రాంతంలో వెలసిన సలేశ్వర లింగమయ్య దర్శనానికి భక్తులు రాళ్లు, రప్పలను సైతం లెక్కచేయకుండా కాలినడకన వస్తున్నాం లింగమయ్యా, దర్శనం పూర్తయిన తరువాత తిరుగు ప్రయాణంలో కొండ ఎక్కుతూ వెళ్లొస్తాం లింగమయ్యా అంటూ నడకతో వచ్చిన ఆయాసాన్ని మరిచిపోతూ ముందుకు సాగుతున్నారు. ఈ ఏడాది ఎండల తీవ్రత మరీ ఎక్కువగా ఉండడంతో పర్యాటకులు రాత్రివేళల్లో సలేశ్వర క్షేత్రానికి పాదయాత్ర చేసేందుకు ఇష్టపడుతున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తోకల గురువయ్య ఆధ్వర్యంలో ఆలయం వద్ద భక్తులకు దర్శనంలో అసౌకర్యం కలగకుండా ప్రత్యేక జనరేటర్, సౌరశక్తి దీపాల సహాయంతో ప్రత్యేక విద్యుద్దీపాలంకరణ చేశారు. దర్శనానికి వెళ్లే క్రమంలో భక్తులు ప్రమాదాలకు గురికాకుండా, తోపులాటలు జరుగకుండా ఆలయ కమిటీ వారు చెంచు యువ వలంటీర్లను ఏర్పాటుచేసి 24 గంటల పాటు భక్తులకు సేవలందిస్తున్నారు. చెంచు పూజారుల ఆధ్వర్యంలో ప్రతీరోజు లింగమయ్యకు అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నారు. నల్లమలలోని పరహాబాద్ చౌరస్తా నుంచి మొదలుకొని పుల్లాయపల్లి, రాంపూర్, లింగమయ్య ఆలయం వద్ద గల స్నానాలగుండం వరకు 250 మంది పోలీసులతో ప్రత్యేక రక్షణ చర్యలు చేపడుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హేమలత ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా రాంపూర్ పెంట వరకు భక్తులకు తాగునీటి సౌకర్య ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



కర్రల సహాయంతో కొండ దిగుతున్న జనాలు

ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేత ప్రారంభం

సలేశ్వరం జాతర సోమవారం ప్రారంభమవ్వడంతో వన్యప్రాణులకు ప్లాస్టిక్ నుంచి ముప్పు వాటిల్లకుండా మంగళవారం అటవీశాఖ డీఎఫ్‌వో రోహిత్‌గోపిడి పర్యవేక్షణలో రేంజ్ అధికారులు ఈశ్వర్, ఆదిత్య డీఆర్‌వో రవి కుమార్, ఇతర సెక్షన్, బీట్ అధికారులు ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేతను ప్రారంభించారు. వలంటీర్ల సహాయంతో పరహాబాద్ నుంచి రాంపూర్‌పెంట వరకు పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను మంగళవారం సేకరించారు. నాలుగు ట్రాక్టర్ల ప్లాస్టిక్ వ్యర్థాలను మన్ననూరులోని రీసైక్లింగ్ కేంద్రానికి చేరవేశారు. మంగళవారం రాత్రి తొమ్మిది గంటల సమయానికి టూరిస్టు, బస్సులు, కార్లు, ఆటోలు కలిపి రెండువేలకు పైగా, ద్విచక్ర వాహనాలు 500లకు పైగా తరలివెళ్లాయని అటవీ టోల్‌గేట్ సిబ్బంది తెలిపారు.

ఆకలి తీరుస్తున్న అన్నదాన కేంద్రాలు

సలేశ్వర దర్శనానికి వచ్చే భక్తులకు నిరంతరాయంగా హైదరాబాద్, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ ప్రాంతాలకు చెందిన దాతలు అన్నదాన కేంద్రాలు, అంబలి కేంద్రాల ద్వారా ప్రతీయేటా మాదిరే ఈ ఏడాది భక్తుల ఆకలి తీరుస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రాంపూర్ పెంటలో ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా 24 గంటల పాటు అస్వస్థతకు గురైన వారికి వైద్యులు చికిత్సలు అందిస్తూ మందులను పంపిణీ చేస్తున్నారు.

ఘనంగా వెంకన్న కల్యాణం

మహబూబ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 23 : పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త అళహరి మధుసూదన్‌కుమార్, అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాల అనంతరం పల్లకీలో గ్రామోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. దేవాదాయ శాఖ కార్య నిర్వహణ అధికారి శ్రీనువాసరాజు, అడిషనల్ కార్యనిర్వహణాధికారి శ్రీనువాస్, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రామకృష్ణ, సూపరింటెండెంట్ నిత్యానందం, అర్చకులు పాల్గొన్నారు.

జీవన వైవిధ్య సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

- ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ మధుసూదన్‌రెడ్డి

పాలమూరు యూనివర్సిటీ, ఏప్రిల్ 23 : జీవ వైవిధ్య సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పీయూలోని అకాడమిక్ ఆడిటోరియంలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'జీవ వైవిధ్య సంరక్షణలో నూతన పోకడలు మరియు సుస్థిరభివృద్ధి' అనే అంశంపై జరిగిన ఒకరోజు జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వాతావరణంలో ప్రకృతి సంరక్షణ అందరి బాధ్యత అని, ప్రకృతిని మనం కాపాడితే అది మనల్ని కాపాడుతుందని అన్నారు. అంతకుముందు ముఖ్య వక్త ఓయూ ప్రొఫెసర్ శైలజ మాట్లాడుతూ అంతరించిపోతున్న వృక్ష, జంతు జాతులను కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణయ్య, డాక్టర్ నూర్జహాన్‌బేగం, డాక్టర్ కిశోర్, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పుష్పలత, వృక్షశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ శివకుమార్, డాక్టర్ రాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

నీటి గుంతలో పడి ఉపాధి హామీ కూలీ మృతి



లింగమ్మ (ఫైల్)

రాజాపూర్, ఏప్రిల్ 23 : ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి ఉపాధి హామీ కూలీ మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం గుండ్లపోట్లపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎంపీడీవో, ఉపాధి హామీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపోట్లపల్లి గ్రామ శివారులో ఉన్న చెరువులో ఒండ్రుమట్టి తరలింపు పనులు కొనసాగుతున్నాయి. ఉపాధి కూలీలందరు పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వస్తున్న సందర్భంలో కూలీ కుచ్చర్‌కంటి లింగమ్మ(49) కాళ్లు, చేతులు కడుక్కోవడానికి చెరువులో ఉన్న గుంత వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడిపోయింది. గమనించిన తోటి కూలీలు లింగమ్మను బయటకు తీసి వెంటనే ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఉపాధి సిబ్బంది తెలిపారు.

ఆటో ప్రమాదంలో బాలుడి మృతి



తాహెర్‌బాబా (ఫైల్)

తాడూరు, ఏప్రిల్ 23 : పాఠశాల ముగించుకుని ఆటోలో అమ్మమ్మ ఇంటికి వెళ్తున్న బాలుడిని టూరిస్టు బస్సు తగలడంతో తీవ్ర గాయాల పాలై మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం ఐతోల్ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మండలం కుమ్మెర గ్రామానికి చెందిన ఖాజా, నజియా బేగం దంపతులకు చెందిన పెద్ద కుమారుడు తాహెర్‌బాబా(14) నాగర్‌కర్నూల్‌లోని మైనార్టీ గురుకులంలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు వేసవి సెలవులు ఇవ్వడంతో బాలుడు అమ్మమ్మ ఊరైన పాపగల్ గ్రామానికి మంగళవారం ఆటోలో బయలుదేరాడు. ఐతోల్ గ్రామ సమీపంలో నాగర్‌కర్నూల్ వైపు వెళ్తున్న పెళ్లి టూరిస్టు ఆటో సమీపం నుంచి వెళ్లడంతో కాళ్లు బయటకు పెట్టుకున్న బాలుడికి బస్సు తగులుకుంటూ వెళ్లింది. దీంతో బాలుడు తాహెర్‌బాబా కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబీకులు మెరుగైన వైద్యం కోసం బాలుడిని హైదరాబాద్‌కు తీసుకువెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఘటనకు కారణమైన టూరిస్టు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలంటూ బాలుడి తల్లి నజియాబేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ప్రమాదానికి కారణమైన ఆటోను, టూరిస్టును పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

మల్దకల్, ఏప్రిల్ 23 : సరదాగా చీర ఉయ్యాల ఊగుతూ ప్రమాదవశాత్తు బాలిక మృతి చెందిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సురేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్దకల్‌కు చెందిన హేమలత, పరుశురాముడు దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. వీరి పెద్ద కూతురు హిందూ(13) సోమవారం సాయంత్రం ఇంట్లో ఉన్న చీర ఉయ్యాలలో సరదాగా ఊగుతుండగా అది గొంతుకు బిగుసుకుంది. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

జూపల్లిలో బాలింత..



కల్పన (ఫైల్)

చారకొండ, ఏప్రిల్ 23 : చికిత్స పొందుతు ఓ బాలింతరాలు మృతి చెందిన సంఘటన మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం జూపల్లి గ్రామంలో చోటు చేసుకొంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దాసర్ల కల్పన(27) నెలరోజుల క్రితం రెండవ ప్రసవం కోసం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. ఆసుపత్రి వైద్యులు ఆమెకు ఆపరేషన్ చేశారు. దీంతో కల్పన ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం వారంరోజుల తరువాత ఆమె అనారోగ్యం బారిన పడడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. గత 20 రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతు మంగళవారం మృతి చెందింది. కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన భార్య కల్పన మృతి చెందిందని భర్త వెంకటేష్ ఆరోపించారు. మృతురాలికి భర్తతో పాటు ఏడాది పాప, నెలరోజుల పసిపాప ఉన్నారు.

భరించలేని ఉక్కపోత

- వనపర్తి జిల్లా పాన్‌గల్‌లో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత

మహబూబ్‌నగర్/నారాయణపేట/నాగర్‌కర్నూల్ టౌన్/గద్వాల/వనపర్తి అర్బన్, ఏప్రిల్ 23 : ఉక్కపోతతో పాలమూరు ప్రజానీకం ఉక్కిరిబిక్కిరవుతోంది.. ఎండలు మండతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఎండలో పనిచేయలేక ఉపాధి హామీ, భవన నిర్మాణ కార్మికులు అల్లాడిపోతున్నారు. పనిచేయకపోతే పూటగడవకపోవడంతో ఎండల్లోనే ఆపసోపాలు పడుతూ పనులు చేసుకుంటున్నారు.

వనపర్తి జిల్లా పాన్‌గల్‌లో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కొత్తకోటలో 43.7, చిన్నంబావి, పెబ్బేరులో 43.4, అమరచింత 42.4, పెద్దమందడి 42.3, శ్రీరంగాపూర్, ఆత్మకూరు, వనపర్తిలలో 42.2, గోపాల్‌పేట 41.9, ఘణపూర్ 41.6, మదనాపూర్ 40.8, రేవల్లి 40.5, వీపనగండ్లలో 40.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలో 43.8, అచ్చంపేటలో 43.5, కోడేరులో 43.3, ఉప్పునుంతలలో 43.2, బిజినేపల్లిలో 42.9, పెంట్లవెల్లిలో 42.7, కొల్లాపూర్‌లో 42.6, వెల్దండలో 42.2, కల్వకుర్తిలో 42.1, పెద్దకొత్తపల్లిలో 41.9, చారకొండలో 41.4, తెల్కపల్లిలో 41.0, నాగర్‌కర్నూల్‌లో 40.5, లింగాలలో 40.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లిలో 43.5, కేటీదొడ్డిలో 43.4, ధరూర్‌లో 43.2, అలంపూర్‌లో 42.9, ఇటిక్యాలలో 42.8, గద్వాలలో 42.3, అయిజలో 42.3, మల్దకల్‌లో 41.8, ఉండవెల్లిలో 41.5, రాజోలిలో 41.5, మానవపాడులో 40.6, గట్టులో 39.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలంలో 42.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. బాలానగర్‌లో 42.4, సీసీకుంటలో 42.3, అడ్డాకుల, మహబూబ్‌నగర్‌లలో 42.1 డిగ్రీలు నమోదుకాగా జడ్చర్లలో 41.1, భూత్పూర్‌లో 41.8 డిగ్రీలు నమోదైంది.

నారాయణపేట జిల్లా మక్తల్, కృష్ణలలో 40 డిగ్రీలు, కోస్గి మండలంలో 39, నర్వలో 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

తెలకపల్లి, ఏప్రిల్ 23 : ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం గట్టురాయిపాకుల గ్రామంలో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ పరుశురాములు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గడ్డికోపుల పార్వతమ్మ(42)తో ఇటీవల తన మరిది, పక్కింటి లక్ష్మి అనే మహిళ తరచు గొడవ పడుతున్నారు. దీంతో మనస్తాపానికి గురైన పార్వతమ్మ ఈనెల 22న తన ఇంటి ముందున్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసు కుంది. మృతురాలి తల్లి పుట్ట బక్కమ్మ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

గండీడ్, ఏప్రిల్ 23 : పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తిపై మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సల్కర్‌పేట్ గ్రామానికి చెందిన ఓ యువతితో వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం ఉడిమేశ్వరం గ్రామానికి చెందిన బాల బ్రహ్మచారి అనే వ్యక్తి సన్నిహితంగా ఉండి వివాహం చేసుకుంటానని చెప్పి నమ్మించి వేరే అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. మంగళవారం యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తక్కశిలలో గొర్రెల కాపరి మిస్సింగ్

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 23 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం తక్కశిల గ్రామంలో ఓ గొర్రెల కాపరి తప్పిపోయినట్లు ఎస్సై శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి మండలం, అచ్యుతాపురం గ్రామానికి చెందిన ఎర్రగొల్ల కొండన్నతో పాటు పలువురు గొర్రెల కాపరులు మేపు కోసం రెండునెలల క్రితం వలస వచ్చారు. ఈనెల 18న కొండన్న పెంపుడు కుమారుడైన నాగేష్(24) అనే కాపరి మానసికస్థితి సరిగ్గా లేని కారణంగా తప్పిపోయాడు. గాలించిన ఆచూకీ లభించకపోవడంతో కొండన్న మంగళవారం ఉండవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కుక్కల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

పెబ్బేరు, ఏప్రిల్ 23 : వనపర్తి జిల్లా పెబ్బేరు మునిసిపల్ కేంద్రంలో కుక్కల బెడద ఎక్కువైంది. పట్టణానికి చెందిన వెంకటేష్ మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లగా ఒక్కసారిగా వీధి కుక్కలు వెంట పడ్డాయి. కాలు పిక్క భాగంలో దాడి చేయగా అతనికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలో కుక్కలు విపరీతంగా పెరుగుతున్నా మునిసిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వాటి సమస్య రోజు రోజుకు తీవ్రతరమవుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఉమ్మడి పాలమూరు జిల్లాలో 15 నామినేషన్లు

- నాగర్‌కర్నూల్‌లో తొమ్మిది, మహబూబ్‌నగర్‌లో ఆరు
- స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన బర్రెలక్క



నాగర్‌కర్నూల్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి

నాగర్‌కర్నూల్/మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), ఏప్రిల్ 23, (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండు లోక్‌సభ నియోజకవర్గాల్లో మంగళవారం 15 నామినేషన్లు దాఖలు అయ్యాయి.

నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో మంగళవారం తొమ్మిది మంది అభ్యర్థులు నుంచి మొత్తం 10 నామినేషన్లు దాఖలు అయ్యాయి. పార్లమెంటు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ నామినేషన్లను స్వీకరించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి మల్లు రవి తన మూడవ సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. అదేవిధంగా అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రీఫార్మ్ పార్టీ (ఆధార్ పార్టీ) అభ్యర్థి అంబోజు రవి తరఫున దయాకర్ రెండవ సెట్ నామినేషన్ దాఖలు చేశారు. చిరుతైగల్ కచ్చి పార్టీ అభ్యర్థిగా భారతి దాసరి ఒక సెట్ నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా కర్నె శిరీష(బర్రెలక్క), పిల్లేల శ్రీకాంత్, నేడిగొండ కృష్ణయ్య, పాలాది నాగరాజు, లంద భిక్షపతి, గాలిముడి గీత తమ నామినేషన్లను దాఖలు చేశారు.

మహబూబ్‌నగర్ లోకసభ నియోజకవర్గంలో మంగళవారం ఆరు మంది ఏడు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థిగా జి.రాకేష్ రెండవసారి ఒక సెట్ నామినేషన్ పత్రాన్ని, స్వతంత్ర అభ్యర్థుల్లో మల్లేశ్ హరిచందర్ కూడా రెండవసారి ఒక సెట్ నామినేషన్ పత్రాన్ని, టి.విష్ణువర్ధన్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా రెండు సెట్ల నామినేషన్ పత్రాలను, అలాగే అనీసూర్ రహిమాన్, హనుమేష్, కారుకొండ శ్రీనివాసులు ఒక్కో సెట్టు నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.రవినాయక్‌కు సమర్పించారు.

వెంకటాపురంలో ప్రథమచికిత్స కేంద్రం సీజ్

- కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారులు



వెంకటాపురంలో మందుల స్టాక్‌ను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

గద్వాల క్రైం/అయిజ టౌన్ ఏప్రిల్ 23 : పిల్లలు పుట్టని దంపతులకు ఆర్‌ఎంపీలు చికిత్సలు నిర్వహిస్తున్న ప్రథమచికిత్స కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించి సీజ్ చేసిన సంఘటన మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం వెంకటాపురం గ్రామంలో చోటు చేసుకుంది. డీఎంహెచ్‌వో డాక్టర్ శశికళ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. అయిజ మండలం వెంకటాపురం గ్రామంలో ఎండీ.గౌస్‌పాషా, ఎండీ.అక్బర్‌బాషా అనే ఆర్‌ఎంపీలు సంయుక్తంగా ఓ ప్రథమచికిత్స కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేయగా ఆ ఇద్దరు ఆర్‌ఎంపీలు పిల్లలు పుట్టని దంపతులకు చికిత్సలు చేయడం, వారికి ఆయుర్వేద మందులైన గాడిద గడప, మిరియాలు, ఎల్లిపాయలు, సొంటి తదితరవి అన్ని కలిపి ఒక మాత్రగా ఇవ్వడాన్ని వైద్య సిబ్బంది గుర్తించారు. అలాగే సుఖ వ్యాధులకు చికిత్సలు నిర్వహించడం వంటివి గుర్తించారు. రోగులకు యాంటిబయాటిక్ మందులు, పెయిన్ కిల్లర్స్, స్టెరాయిడ్, గ్లూకోజ్ బాటిల్స్ మొదలగు వాటితో చికిత్సలు నిర్వహిస్తుండటం, రక్తపరీక్షల కోసం టెస్టులు రాసి ల్యాబ్‌లకు పంపడం, కేంద్రంలో మెడిసిన్స్ ఎక్కువ మొత్తంలో నిల్వ ఉంచుకోవడం వంటివి గమనించారు. అలాగే ఆర్‌ఎంపీల పేరు ముందు ల్యాబ్ రిపోర్ట్‌పై డాక్టర్ అని రాసుకోవడం గమనించి ఈ ఇద్దరు ఆర్‌ఎంపీలు నిర్వహిస్తున్న ప్రథమచికిత్స కేంద్రాన్ని సీజ్ చేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ శశికళ తెలిపారు. దాడుల్లో మాతాశిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి స్రవంతి, డిప్యూటీ డెమో మధుసూదన్‌రెడ్డి తదితరులున్నారు.

మిడ్జిల్‌లో ప్రైవేటు క్లినిక్..

మిడ్జిల్ : మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రంలోని ఓ క్లినిక్‌ను వైద్యాధికారులు మంగళవారం సీజ్ చేశారు. మండలంలోని వేముల గ్రామానికి చెందిన గర్భిణీ విజయలక్ష్మీ మృతిపై సోమవారం డీఎంహెచ్‌వో కృష్ణ, జిల్లా మాస్ మీడియా అధికారి తిరుపతిరావు విచారణ చేపట్టారు. విచారణ అనంతరం జిల్లా వైద్యాధికారుల సూచన మేరకు మంగళవారం పోలీస్, రెవెన్యూ అధికారుల సమక్షంలో స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ శివకాంత్, వైద్య సిబ్బందితో కలిసి క్లినిక్‌ను సీజ్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అంబిక, కానిస్టేబుల్ సురేష్‌గౌడ్, వైద్య సిబ్బంది జంగయ్య తదితరులున్నారు.

లక్ష్మమ్మ అవ్వ గుడి స్థలంలో కంచె ఏర్పాటు



వివాద స్థలంలో కంచె ఏర్పాటు చేయిస్తున్న అధికారులు

రాజోలి, ఏప్రిల్ 23 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పచ్చర్ల గ్రామంలో కొన్ని నెలలుగా వివాదం నడుస్తున్న లక్ష్మమ్మ అవ్వ గుడి స్థలంలో ఎంపీవో ఖాజా మొయినుద్దీన్ ఆధ్వర్యంలో మంగళవారం కంచె ఏర్పాటు చేశారు. గ్రామంలోని లక్ష్మమ్మ అవ్వ గుడికి చెందిన స్థలం వివాదం అయిన విషయం తెలిసిందే. ఈ స్థలాన్ని కొందరు అన్యాక్రాంతం చేస్తున్నారన్న విష యం లోకాయుక్తకు ఫిర్యాదు అందింది. లోకాయుక్త నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం ఎంపీవో ఖాజా మొయినుద్దీన్ ఆధ్వర్యంలో ఎనిమిది సెంట్ల స్థలంలో మంగళవారం కంచె ఏర్పాటు చేశారు. వివాద స్థలాన్ని గ్రామ పంచాయతీ పరిధిలోకి తీసుకున్నట్లు ఎంపీవో తెలిపారు.

52 మామిడి చెట్లు దగ్ధం

పెంట్లవెల్లి, ఏప్రిల్ 23 : అగ్ని ప్రమాదం సంభవించి 52 మామిడి చెట్లు కాలిపోయిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం గోప్లాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడు తూమ్‌కుంట ప్రతాప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గోప్లాపూర్ గ్రామ రెవెన్యూ శివారులో ఏడు సంవత్సరాల క్రితం మామిడి తోట సాగు చేశారు. మంగళవారం మామిడి తోటకు సమీపంలో ఉన్న చెత్తకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగి సమీపంలో ఉన్న మామిడి తోటలకు అంటుకున్నాయి. ప్రమాదంలో దాదాపు 52 మామిడి చెట్లు కాలిపోయాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారమందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. దాదాపు రూ.ఐదు లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయాడు.

శాంతినగర్‌లో గడ్డివామి..

వడ్డేపల్లి : జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మునిసిపాలిటీ కేంద్రమైన శాంతినగర్‌లో మంగళవారం గడ్డివామి దగ్ధమై రూ.20 వేల ఆస్తి నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన రామన్‌గౌడ్ అనే రైతు తన పశువుల కోసం గ్రాసాన్ని ఇంటి సమీపంలో నిల్వ ఉంచుకున్నాడు. మంగళవారం గడ్డివామి ప్రమాదవశాత్తు దగ్ధం కావడంతో గ్రామస్థులు గమనించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారమిచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. పశుగ్రాసం కొరతగా ఉన్న సమయంలో దగ్ధం కావడంతో రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

భార్యను చంపిన భర్తకు పదేళ్ల జైలుశిక్ష

నర్వ/నారాయణపేట, ఏప్రిల్ 23 : భార్యను హత్య చేసిన భర్తకు పదేళ్ల జైలుశిక్షతో పాటు, రూ.20 వేల జరిమానా విధిస్తూ మంగళ వారం నారాయణపేట జిల్లా కోర్టు తీర్పు ఇచ్చిం ది. ఎస్సై కుర్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా నర్వ మండలం కొత్తపల్లె గ్రామానికి చెందిన మేకల సురేఖకు ఊట్కూర్ మండలం చిన్నపొర్ల గ్రామానికి చెందిన మోకల రాజుతో 2015 మార్చి 12న వివాహం జరిగింది. రాజు కొత్తపల్లె గ్రామానికి ఇల్లరికం వచ్చాడు. అయితే, భార్య సురేఖను భర్త రాజు తరచూ అనుమానించేవాడు. ఈ క్రమంలో అదే ఏడాది నవంబర్ ఐదో తేదీన భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. గొడవ పెద్దదిగా మారి రాజు ఇంట్లో ఉన్న కిరోసిన్‌ను తీసుకొని భార్యపై పోసి నిప్పంటించాడు. అప్పట్లో గ్రామస్థులు పోలీసులకు సమాచారమందించగా ఘటనా స్థలానికి వెళ్లిన అప్పటి ఎస్సై నర్సింహులు చావుబతుకుల్లో ఉన్న ఆమెతో మాట్లాడి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. అనంతరం ఆమె మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 45 రోజుల తర్వాత మృతి చెందింది. భార్య చావుకు కారణమైన భర్త రాజును అప్పట్లో రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి మంగళ వారం నారాయణ పేట జిల్లా కోర్టులో అలంపూర్, ఆత్మకూర్ సీఐలు ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నేరస్తుడికి వ్యతిరేకంగా 24 మంది సాక్షులను సేకరించి 14 మందిని కోర్టులో ప్రవేశపెట్టి వాదనలు వినిపించారు. సాక్షాలు రుజువు కావడంతో నారాయణపేట జిల్లా కోర్టు ప్రధాన న్యాయాధికారి మహమ్మద్ అబ్దుల్‌రఫీ తీర్పు వెలువరించారు. భార్య సురేఖను చంపిన భర్త రాజుకు పది సంవత్సరాల జైలుశిక్ష, రూ.20 వేల జరి మానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై కుర్మయ్య తెలిపారు. కేసుకు సంబంధించి ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ నేరస్తుడికి శిక్ష పడేలా చేసిన పోలీసులకు, కోర్టు లైజెన్ బాలకృష్ణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మురళీకృష్ణ, ఆకుల బాలప్పలను అభినందించారు. త్వరలోనే వారికి రివార్డులను అందిస్తామని తెలిపారు.

దొంగతనాలకు పాల్పడిన నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ

పెబ్బేరు, ఏప్రిల్ 23 : వనపర్తి జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడిన నలుగురు నిందితులను పెబ్బేరు పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. వారి నుంచి దొంగలించిన సొత్తును రికవరీ చేశామని డీఎస్పీ వెంకటేశ్వరరావు, కొత్తకోట సీఐ రాంబాబు, పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్ రెడ్డిలు తెలిపారు. మంగళవారం పెబ్బేరు పోలీస్‌స్టేషన్‌లో వారు వివరాలు వెల్లడించారు. పెద్దదగడకు చెందిన ఉడతల కృష్ణమూర్తి, కొత్తకోటకు చెందిన గుడిసె ఆదర్శ్, అచ్యుతాపురం గ్రామానికి చెందిన శ్రావణి, వనపర్తికి చెందిన దప్పు నాగమణిలు ముఠాగా ఏర్పడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో దొంగతానికి పాల్పడ్డారు. వీరిని పట్టుకోవడానికి పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి తనిఖీలు నిర్వహించగా మంగళవారం ఉదయం పెబ్బేరు బైపాస్ వద్ద బైకుపై వీరు వెళ్తుండగా పట్టుకొని విచారించగా చోరీలకు సంబంధించి నేరాన్ని ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. వీరి నుంచి నాలుగు మొబైల్ ఫోన్లు, ఒక బైక్, జనంపల్లిలో చోరీ చేసిన ఒకటిన్నర తులం బంగారం, గుమ్మడం గ్రామంలో చోరీ చేసిన 1.8 తులాల బంగారం, గోపాల్‌పేట మండలం చాకలిపల్లి గ్రామంలో దొంగతనం చేసిన 3.7 తులాల బంగారాన్ని రికవరీ చేసి సీజ్ చేసినట్లు వారు వివరించారు. చోరీ కేసులో ఏ-1 నిందితుడిగా ఉన్న ఉడతల కృష్ణమూర్తి చాలాచోట్ల దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. గుమ్మడం గ్రామంలో, గోపాల్‌పేట మండలం చాకలిపల్లిలో, కొల్లాపూర్ మండలం అంకిరావుపల్లిలో, పాన్‌గల్ మండల కేంద్రంలో, కొత్తకోట మండలం నాటవెల్లిలో, వనపర్తి పట్టణంలో, గోపాల్‌పేట రోడ్డులో ఉన్న ఓ ఇంట్లో దొంగతనం చేశాడని పోలీసులు వెల్లడించారు. దొంగలను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన ఎస్సై హరిప్రసాద్‌రెడ్డిని, పీసీలు నరసింహ, వెంకట్‌రాములు, ఆనంద్‌లను ఎస్పీ రక్షితమూర్తి అభినందించినట్లు డీఎస్పీ, సీఐలు తెలిపారు.

గాలి దుమారానికి కూలిన టెంట్లు

- జనాలు లేకపోవడంతో తప్పిన పెను ప్రమాదం



బిజినేపల్లిలో సీఎం సభ ప్రాంగణంలో ఈదురు గాలులకు కూలిన టెంట్లు

బిజినేపల్లి, ఏప్రిల్ 23 : బిజినేపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి బహిరంగ సభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టెంట్లు గాలి దుమారానికి టెంట్లు ఒక్కసారిగా కూలిపోయాయి. మంగళవారం సాయంత్రం ఈదురు గాలులు వీయడంతో సభ ప్రాంగణంలో వేసిన టెంట్లు బిగించి కట్టిన ఇనుప ఊచలతో సహా ఎగిరి కుర్చీలపై పడ్డాయి. అప్పటికి జనాలు ఎవరూ సభ ప్రాంగణానికి చేరుకోకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. జనాలు వచ్చిన తర్వాత టెంట్లు గాలికి కూలి మీద పడి ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని, జనాలు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అక్కడే ఉన్న కార్మికులు వెంటనే టెంట్లను మళ్లీ వేశారు.

ప్రధాని మోదీతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యం

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

కల్వకుర్తి, ఏప్రిల్ 23 : ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వంతోనే ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ సాధ్యమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. కల్వకుర్తి పట్టణంలో ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశానికి మందకృష్ణ మాదిగ, ఎంపీ పోతుగంటి రాములు, ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ 1994నుంచి ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఉద్యమిస్తున్నట్లు తెలిపారు. తనకు పదవులు ముఖ్యం కాదని, వర్గీకరణ సాధనే ఏకైక లక్ష్యమని పేర్కొన్నారు. జాతికి న్యాయం జరగాలని బీజేపీకి మద్దతు ప్రకటించామని బీజేపీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం ఎంపీ పోతుగంటి రాములు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు ప్రధాని నరేంద్రమోదీ అంగీకరించారని తెలిపారు. సమావేశంలో నాయకులు మబ్బుసాయన్న మాదిగ, కృష్ణయ్య, రామస్వామి, జంగయ్య, మొగిలి దుర్గాప్రసాద్, బండెల రామచంద్రారెడ్డి, నరసింహా, కార్యకర్తలు తదితరులున్నారు.

అణచివేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- తెలంగాణ దండోరా వర్కింగ్ ప్రెసిడెంట్ కలమూరి రాములు



అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న తెలంగాణ దండోరా నాయకులు

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 23 : కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలను అణచివేతకు గురిచేస్తోందని తెలంగాణ దండోరా వర్కింగ్ ప్రెసిడెంట్ కలమూరి రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంతటి గోపి అన్నారు. మంగళవారం పెద్దకొత్తపల్లిలోని అంబేడ్కర్ చౌరస్తాలో తెలంగాణ దండోరా ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలను మోసగిస్తూ మూడు పార్లమెంట్ స్థానాల్లో ఒక స్థానం కేటాయించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ దండోరా తిరుగుబాటు యాత్ర చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగాన్ని మార్చాలనే ఆలోచనలో ఉన్నాయని ఆరోపించారు. ప్రజలు ఆలోచించి నిజమైన వ్యక్తులను తెలుసుకుని ఓటు వేయాలని వారు కోరారు. కార్యక్రమంలో తెలంగాణ దండోరా రాష్ట్ర కార్యదర్శి దర్శనాల సాయికుమార్, జిల్లా అధ్యక్షుడు ఎల్లపాక జాన్, కొల్లాపూర్ ఇన్‌చార్జ్ కడ్తాల విజయ్‌కుమార్, మండల నాయకులు కలమూరి రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ ఈఈ విజయ్‌కుమార్

ఊర్కొండ, ఏప్రిల్ 23 : మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈఈ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో విజయ్‌కుమార్ అధ్యక్షతన తాగునీటిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ప్రధానంగా కొన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సరిగా సరఫరా కావడం లేదని, ఇబ్బందులున్న చోట సరిచేయాలని కోరారు. అదేవిధంగా గ్రామాల్లో ఉన్న బోరు బావులను సరి చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఎంపీడీవో విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలు పని చేస్తున్న చోట తాగునీరు లభ్యం అయ్యేవిధంగా చూడాలని, విశ్రాంతి తీసుకోవడానికి నీడను ఏర్పాటు చేయాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో ఎంపీవో వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమణి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ప్రజాస్వామ్యం పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం

- జాతీయ ఎస్సీ, ఎస్టీ మేధావుల ఫోరం అధ్యక్షుడు ఆరేపల్లి రాజేందర్

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 23: దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన కాంగ్రెస్ పార్టీతోనే దేశంలో ప్రజాస్వామ్యం పరిరక్షణ సాధ్యమని జాతీయ ఎస్సీ, ఎస్టీ మేధావుల ఫోరం అధ్యక్షుడు ఆరేపల్లి రాజేందర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి నివాసంలో జాతీయ ఎస్సీ, ఎస్టీ మేధావుల ఫోరం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరేపల్లి రాజేందర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం మొదటగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయం, పారిశ్రామికంగా అనేక సంస్కరణలు చేపట్టి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిందన్నారు. అంబేడ్కర్ రాసిన భారత రాజ్యాంగం ప్రకారం మానవ హక్కులను కాపాడుతూ అణగారిన వర్గాలకు, మహిళలకు హక్కులు కల్పించిందన్నారు. ప్రస్తుతం దేశంలో విచ్ఛిన్నకర, మతతత్వ శక్తులు రాజ్యాంగాన్ని మార్చాలని కుట్రలు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో దళిత, బహుజనులు, అగ్రవర్ణ పేదలంతా ఏకమై మతతత్వ పార్టీలను ఓడించాలని ఆయన కోరారు. సమావేశంలో జాతీయ ఎస్సీ, ఎస్టీ మేధావుల ఫోరం నాయకులు వంకేశ్వరం లక్ష్మయ్య, లక్ష్మీనారాయణ, సతీష్, శ్యాంసుందర్, చెన్నయ్య, ఎల్లస్వామి, యాదమ్మ పాల్గొన్నారు.

చలో బిజినేపల్లికి తరలిన కాంగ్రెస్ నాయకులు

అచ్చంపేటటౌన్, ఏప్రిల్ 23: బిజినేపల్లి మండలంలో నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి సభకు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వాహనాలకు బిజినేపల్లి సభ స్టిక్కర్లను ఎమ్మెల్యే అతికించి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్త లు తదితరులు పాల్గొన్నారు. కాగా, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, తెలకపల్లి, కోడేరు, పె ద్దకొత్తపల్లి, చారకొండ, పెంట్లవెల్లి, కల్వకుర్తి, తిమ్మాజిపేట, అమ్రాబాద్, మన్న నూరు తదితర మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

ఘనంగా పోలేరమ్మ బోనాలు

వంగూరు ఏప్రిల్ 23: మండలంలోని కొండారెడ్డిపల్లిలో మంగళవారం ముత్యాల విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలేరమ్మ తల్లిబోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు ఊరేగింపుగా పోలేరమ్మ ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల లక్ష్మారెడ్డి దంపతులు అమ్మవారికి దర్శించుకొని ప్రత్యేక పూజలుచేశారు. ముత్యాల గోవర్ధన్‌రెడ్డి, శాయిరెడ్డి, వేమారెడ్డి, ఇందుకుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

- ఆలయాల్లో పూజలు, హోమాలు

- శోభాయాత్రల్లో పాల్గొన్న భక్తులు



ఊర్కొండపేటలో హనుమాన్ శోభాయాత్రను ప్రారంభిస్తున్న ప్రధాన అర్చకులు, నాయకులు

కల్వకుర్తి, ఏప్రిల్ 23 : కల్వకుర్తి పట్టణంలోని శ్రీహనుమాన్ దేవాలయంలో ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు కనులపండుగగా కొనసాగుతున్నాయి. మంగళవారం హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీలక్ష్మీ హరిహర రుద్ర హోమం, లక్ష తమలపత్ర అర్చన, హోమాలు, శ్రీదయానంద గురుస్వాముల ఆధ్వర్యంలో కొనసాగాయి. ఆంజనేయస్వామిని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్, మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, కల్వకుర్తి మాజీ సర్పంచ్‌బృంగి ఆనంద్‌కుమార్, మాజీ మునిసిపల్ చైర్మన్ రాచోటి శ్రీశైలం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర పురవీధుల గుండా సాగింది. హనుమాన్ నామస్మరణతో మారుమోగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఊర్కొండపేటలో..

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేటలో మంగళవారం హనుమాన్ జయంతి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన అర్చకులు చిలివేల్లి దత్తాత్రేయశర్మ, చిలివేల్లి శ్రీనివాసశర్మల స్వగృహం నుంచి శోభాయాత్ర ప్రారంభమై గ్రామంలోని వీధుల గుండా అభయాంజనేయస్వామి ఆలయం చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ప్రాంగణంలో యజ్ఞం నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి సత్యచంద్రారెడ్డి, మాజీ చైర్మన్ నర్సిరెడ్డి, నాయకులు మనోహర్‌రెడ్డి, రమేష్‌నాయక్, నాగోజీ, శ్రీనివాసులు, అంజయ్యగౌడ్, రవీందర్‌గౌడ్, రామాంజనేయులు గౌడ్, రవీందర్‌సాగర్, చంద్రయ్య తదితరులున్నారు. అర్చకులు దత్తాత్రేయశర్మ, శ్రీనివాసశర్మ, ప్రవీణ్‌శర్మ, మహేష్‌శర్మ ఆలయం సిబ్బంది వరలక్ష్మీ, శ్రీశైలం పాల్గొన్నారు. శోభాయాత్రలో పాల్గొన్న భక్తులకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం కోసం ఊర్కొండపేట గ్రామానికి చెందిన ఎండీ వహీదోద్దిన్ తాగునీరు, శీతలపానీయాలు సమకూర్చి అందించారు.

పెద్దకొత్తపల్లిలో ..

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో హనుమాన్ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పెద్దకొత్తపల్లి గ్రామంలో ట్రాక్టర్‌పై హనుమాన్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలతో అలంకరించి గ్రామంలోని వీధుల గుండా శోభాయాత్ర కనుల పండుగగా జరిగింది. కార్యక్రమంలో హనుమాన్ భక్తులు బెట్టరి నాగ రాజు, రఘుపతిరెడ్డి, నవీన్‌శెట్టి, రవీందర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట పట్టణంలో..

అచ్చంపేటటౌన్: హనుమాన్ జయంతి సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీవీపీ పట్టణ కార్యదర్శి ముక్తాల శశ్రన్, ఆర్‌ఎస్‌ఎస్, బీజేవైఎం కార్యకర్తలు నాగరాజు, పవన్, అఖిలేస్, చందులాల్, అమర్ పాల్గొన్నారు.

మన్ననూరు గ్రామంలో..

మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని మన్ననూరులో హనుమాన్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పడమటి ఆంజనేయస్వామికి తమలపాకులతో అలంకరించి ప్రత్యేక అభిషేకాలు చేశారు. వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు సంబు వెంకట్‌రమణ, ఆర్యవైశ్య మహాసభ రీజినల్ చైర్మన్ జూలూరి సత్య నారాయణ, వికాస తరంగిణి సభ్యులు సంబు శోభ, జయమ్మ, ప్రభావతమ్మ, పద్మజ , గోపాల్‌రెడ్డి, హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు.

చారకొండలో..

చారకొండ: చారకొండ హనుమాన్ జయంతిని వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యువకులు వివిధ రకాల పూలతో వాహనాన్ని అలంకరించి హనుమాన్ చిత్రపటాన్ని పెట్టి ఊరేగించారు. యువకులు గుండె శివగౌడ్, రామకృష్ణగౌడ్, కిరణ్‌గౌడ్, పాల్గొన్నారు.



కల్వకుర్తిలో నిర్వహించిన హోమంలో పాల్గొన్న భక్తులు



అచ్చంపేటలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



చారకొండలో హనుమాన్ శోభాయాత్ర

మద్దిమడుగులో ముగిసిన ఉత్సవాలు



మద్దిమడుగు ఆలయంలో హోమం చేస్తున్న వేద పండితులు

అమ్రాబాద్, ఏప్రిల్ 23: పదర మండల పరిధిలోని మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి ఆలయంలో మూడు రోజుల నుంచి నిర్వహించిన హనుమాన్ జయంతి ఉత్సవాలు ముగిశాయి. మంగళవారం ఉదయం ఆలయంలో మహా కుంభాభిషేకం, హనుమాన్ గాయత్రి హోమం, పూర్ణాహుతి, హనుమాన్ దీక్ష మాల విరమణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వేదపండితుల వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హనుమాన్‌జయంతి ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల భక్తులతో పాటు రెండు రోజుల నుంచి సలేశ్వరం లింగమయ్య స్వామి ఉత్సవాలు ప్రారంభం కావడంతో మద్దిమడుగు ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి రంగాచారి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

పోలింగ్ బూతుల్లో వసతులు కల్పించాలి

- 25 నుంచి ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్పులను అందించాలి

- అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఎస్.శ్రీను



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఎస్.శ్రీను

కల్వకుర్తి, ఏప్రిల్ 23 : పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఎస్.శ్రీను ఆదేశించారు. ఈ నెల 25 నుంచి మే 8వరకు బూత్‌లెవల్ అధికారులతో ఓటర్లకు ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్పులను అందించాలని సూచించారు. కల్వకుర్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో ఎస్.శ్రీను అధ్యక్షతన సెక్టార్ అధికారులకు ఎన్నికల్లో తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీను మాట్లాడుతూ మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల నియామవళి, నిబంధనలు అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం, 27మంది సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

జేపల్లిలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు

చారకొండ: లోక్‌సభ ఎన్నికల్లో నేపథ్యంలో కల్వకుర్తి నియోజ కవర్గంలోని చారకొండ మండలం జూపల్లి లో ఉన్న 130వ పోలింగ్ కేంద్రాన్ని జేపల్లిలో ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ కేసీ ప్రమీల తెలిపారు. మంగళ వారం తహసీల్దార్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో జేపల్లి పంచాయతీల్లోని దొడ్లపల్లి, దొంతలగుట్టతండా, నేమలిగుట్టతండా ఓటర్లు జూపల్లికి వచ్చి తమ ఓటును వినియో గించుకొనేవారని తెలిపారు. ఓటర్ల సౌకర్యార్థం కోసం జేపల్లిలోనే పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అచ్చంపేట నియోజక వర్గంలోని మండలంలో 14, కల్వకుర్తి నియోజకవర్గంలోని మండలంలో 7 మొత్తం 21 పోలింగ్ కేంద్రాలున్నాయని తహసీల్దార్ కేసీ ప్రమీల పేర్కొన్నారు.

ముగిసిన సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు



ఏకాంతసేవలో ఉన్న స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

చారకొండ, ఏప్రిల్ 23: మండలంలోని సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి దేవాలయంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని ఈనెల 16 నుంచి ప్రారంభమైన సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు ఏకాంతసేవ, ద్వాదశ ఆరాధన కార్యక్రమాలతో మంగళవారం ముగిశాయని ఆలయ కమిటీ చైర్మన్ డేరం రామశర్మ, ఈవో మల్లెల రఘు తెలిపారు. ఏకాంత సేవలో స్వామి వారికి ఆలయ అర్చకులు అభిషేకం, నిత్య పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించామని ఆలయ చైర్మన్ తెలిపారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకొన్నారు. కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ బ్రహ్మోత్సవాల్లో ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నిరంజన్, ఆలయ అర్చకులు డేరం మురళీదర్‌శర్మ, డేరం లక్ష్మణశర్మ, డేరం ప్రవీన్‌శర్మ, డేరం అనంతరామశర్మ, డేరం గోపికృష్ణశర్మ, డేరం వేణుగోపాలశర్మ, డేరం రఘుశర్మ, డేరం జయప్రకాష్‌శర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వెంచర్ స్థలంలో డిజిటల్ సర్వే

కల్వకుర్తి, ఏప్రిల్ 23 : కల్వకుర్తి మునిసిపల్ కార్యాలయ సమీపంలోని సర్వే నెంబరు 54/ఏ వెంచర్ స్థలంలో డిజిటల్ సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండల సర్వేయర్ అమీనుద్దీన్, టౌన్ ప్లానింగ్ అధికారి విజయ్‌కుమార్‌లతో కలిసి 54/ఏ సర్వే నెంబర్‌లోని వెంచర్ స్థలాన్ని కమిషనర్ సర్వే చేయించారు. 54/ఏ సర్వే నెంబరులోని యాజమానులకు నోటీసులు జారీ చేసి ఆ వెంచర్‌లో పదిశాతం వాటాను గుర్తించి హద్దులు ఏర్పాటు చేస్తామని కమిషనర్ పేర్కొన్నారు. సర్వేలో మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ సమ్మర్ క్యాంప్ ప్రారంభం

కల్వకుర్తి, ఏప్రిల్ 23 : కల్వకుర్తి పట్టణంలోని మినీ స్టేడియంలో మంగళవారం సమ్మర్ క్రికెట్ క్యాంపును ప్రారంభించారు. కార్యక్రమానికి మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సురేష్‌కుమార్, జనరల్ సెక్రటరీ రాజశేఖర్ హాజరయ్యారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ క్రికెట్ క్రీడకు ఎంతో ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ కోచ్ గోపాలకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సింగం విజయ్‌గౌడ్, కల్వకుర్తి క్రికెట్ అసోసియేషన్ నాయకులు సుధాకర్, రిటైర్డు పీఆర్‌టీయూ సెక్రటరీ సత్యనారాయణ, కల్వకుర్తి క్రికెట్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

అమ్రాబాద్, ఏప్రిల్ 23: అమ్రాబాద్ మండల కేంద్రానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అమ్రాబాద్‌కు చెందిన నాయక్ సర్దార్ మాట్లాడుతూ పలకపల్లి అలీ ఆధ్వర్యంలో సుమారు 15 మంది బీఆర్ఎస్ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ విధానాలకు ఆకర్షితులై చేరుతున్నట్లు తెలిపారు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో మల్లురవి గెలుపు కోసం కృషి చేస్తామని ఆయన వెల్లడించారు.

వైభవంగా విమాన రథోత్సవం

లింగాల: మండల కేంద్రమైన లింగాలలో ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం తెల్లవారుజామున విమానరథోత్సవం (పెద్దతేరు) కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయం వద్ద సంప్రదాయరీతిలో ఆలయ ప్రధాన అర్చకులు రామాచార్యులు, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ప్రత్యేక పూజలు జరిపించారు. పూజల అనంతరం విమాన రథాన్ని లాగారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఆలయ అభివృద్ధి కమిటీసభ్యులు, నాయకులు పూజారి భాస్కర్, వెంకటయ్య, పరమేశ్వర్, వెంకటయ్య, బాలాజీ, ఇందిరమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

కల్వకుర్తి, ఏప్రిల్ 23 : కల్వకుర్తి మండలం ఎల్లికల్ జడ్పీహెచ్ పాఠశాలలో క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్లాస్‌మేట్ క్లబ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలిమిచెర్ల రమేష్ పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థులు ఇష్టంతో చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రాఘవేందర్, కిషన్ తదితరులున్నారు.

కొల్లాపూర్‌లో..

కొల్లాపూర్ : ప్రపంచ పుస్తక దినోత్సవం పురస్కరించుకుని కొల్లాపూర్‌లోని గాంధీ హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం క్లాస్‌మేట్ క్లబ్ తాలుకా అధ్యక్షుడు పతంజలి శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లాస్‌మేట్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కాశిపురం మహేష్, మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి, కోశాధికారి సోమిశెట్టి రాంప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవాలి

కల్వకుర్తి, ఏప్రిల్ 23 : కల్వకుర్తి పట్టణంలోని వ్యాపారులు తమ ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీలోపు లైసెన్సు తీసుకుని వ్యాపారం నిర్వహించుకోవా లన్నారు. లేకపోతే వ్యాపార సముదాయాలకు రుసుము, పెనాల్టీ విధిస్తూ సీజ్ చేస్తామన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న అసెస్‌మెంట్ పూర్తి చేసుకోకపోతే కార్యాలయంలో డాక్యుమెంట్లు సమర్పించి అసెస్‌మెంట్ చేయించుకోవాలని ఆయన కోరారు.

కాంగ్రెస్‌తో సంక్షేమం సాధ్యం

- యువజన కాంగ్రెస్ నాయకుడు కాయితీ ఆశాదీప్‌రెడ్డి

కల్వకుర్తి, ఏప్రిల్ 23 : కాంగ్రెస్‌తోనే సంక్షేమం సాధ్యమని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశాదీప్ రెడ్డి అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవిని పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి మ ద్దతు ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తె లంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, గ్యారెం టీలు దేశమంతా అమలు కావాలంటే కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే సాధ్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించడానికి ఓటర్లు సిద్ధంగా ఉన్నారని ఆశాదీప్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపీ అభ్యర్థిని కలిసిన వారిలో నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

మల్లురవికి సన్మానం

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 23: గీత కార్మికుల జీవన విధానాలు, స్థితిగతులు పూర్తిగా తెలిసిన కాంగ్రెస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లు రవికి కల్లు గీత కార్మికుల సంపూర్ణ మద్దతు ఉంటుందని రాష్ట్ర కల్లుగీత సహకార సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలరాజుగౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవిని కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరీరయ్యగౌడ్, ఇజిల్లా అధ్యక్షుడు మల్లయ్యగౌడ్, అంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

కందనూలు, ఏప్రిల్ 23 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీపురం చౌరస్తాలో అర్ధరాత్రి చిరు వ్యాపారుల దుకాణ సముదాయంలో జరిగిన అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం అగ్ని ప్రమాద స్థలాన్ని పరిశీలించి బాధితులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదం జరగడం చాలా బాధాకరమన్నారు. సర్వం కోల్పోయిన చిరు వ్యాపారులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్, మునిసిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి కోరారు. అలాగే బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కూడా ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. బాధితులతో మాట్లాడి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. తక్షణమే ప్రభుత్వం ఆస్తి నష్టాన్ని అంచనా వేసి బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

తాడూరు, ఏప్రిల్ 23 : మండలంలోని గోవిందాయపల్లి గ్రామంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు రెండవ రోజు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ముఖ్యంగా తెల్లవారుజామునే స్వామివారికి అభిషేకం నిర్వహించి అనంతరం శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని కనుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త రాఘవేందర్‌రావు స్వామివారికి వస్త్రాలను సమర్పించి కల్యాణాన్ని వేద పండితుల మంత్రోచ్ఛరణలతో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో తాడూరు, సిర్సవాడ, ఎట్టిధార్‌పల్లి, ఐతోల్ తదితర గ్రామాల భక్తులు పాల్గొన్నారు. బుధవారం తెల్లవారుజామున స్వామివారి రథోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీల ద్వారా మెరుగైన విద్య

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.పద్మ

తెలకపల్లి, ఏప్రిల్ 23 : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 3-6 సంవత్సరాల చిన్నారులకు ఆటపాటల ద్వారా మెరుగైన విద్య అందిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.పద్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో ప్రీస్కూల్ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు అక్కరీ, చిన్నారుల తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

కల్వకుర్తి పట్టణంలోని విద్యానగర్-2లో..

కల్వకుర్తి: కల్వకుర్తి పట్టణంలోని విద్యానగర్-2లో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ప్రీస్కూల్ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, అరుణ, చిన్నారులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, తల్లులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలి

తిమ్మాజిపేట, ఏప్రిల్ 23 : రసాయన ఎరువులను విక్రయించే దుకాణం యజమానులు మందుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ సూచించారు. మండల కేంద్రం తిమ్మాజిపేటలోని రైతు వేదిక కేంద్రంలో మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల దుకాణాదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ దుకాణంలో ఏ రకాల రసాయన మందులు అందుబాటులో ఉన్నాయి, వాటి ధరలు ఏ రైతుకు విక్రయించింది విధిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గీతా పారాయణం

తిమ్మాజిపేట, ఏప్రిల్ 23 : తిమ్మాజిపేట మండల పరిధిలోని అప్పాజీపల్లి శివారులో నరసన్నగుట్టపై స్వయంభుగా వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో మంగళవారం భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో గీతా పారాయణం చేశారు. ఈ సందర్భంగా మలయాళ స్వామి విశ్వశాంతి భక్తజన భజన బృందంతో పారాయణం విష్ణు సహస్రనామార్చన, హనుమాన్‌చాలీసా వంటివి పారాయణం చేశారు. పౌర్ణమి సందర్భంగా దాతలు చిలుక మనీషా మోర్యా తేజరెడ్డి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు.

మైనింగ్ పనులు ఆపాలి: గ్రామస్థులు

బల్మూరు, ఏప్రిల్ 23 : మండల పరిధిలోని మైలవరం గ్రామ సమీపంలో ఉన్న గుట్ట మైనింగ్ పనులను ఆపాలని గ్రామస్థులు కోరారు. వారం రోజుల క్రితం స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. దాంతో ఆర్‌ఐ నాగచైతన్య గ్రామానికి వచ్చి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ఇళ్లు, చెట్లు, క్రీడా ప్రాంగణం, మిషన్ భగీరథ పథకంలో నిర్మించుకున్న వాటర్ ట్యాంక్ అన్ని గుట్టకు సమీపంలో ఉన్నాయన్నారు. అధికారులు నివేదిక తయారు చేసుకుని పంచానామా చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బల్మూరు ఆర్‌ఐ శివకుమార్ పాల్గొన్నారు.